

భర్త చేతిలో.. భార్య హత్య

కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో ఘటన... 5లో



పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

పది, ఇంటర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచనలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13: త్వరలో జరగనున్న పది, ఇంటర్మీడియట్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్) పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా విజ్ఞప్తి చేశారు. విద్యా పీఠం కమిటీ ఛైర్మన్ హోదాలో కలెక్టర్, ఎస్పీ సీహెచ్ శ్రీధర్ మంగళవారం ఈ సమీక్ష నిర్వహించారు. ఓపెన్ పరీక్షల నిర్వహణకై నియమించిన హైపవర్ జిల్లా కమిటీ ద్వారా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలకు 1,376, ఇంటర్ పరీక్షలకు 5,199 మంది, ప్రాక్టికల్ పరీక్షలకు 3,649 మంది హాజరవుతారని, వీరి కోసం 17 కేంద్రాలు ఏర్పాటుచేసి అక్కడ 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. పరీక్షా పత్రాల తరలింపులో పోలీసులు, సెక్యూరిటీ పకడ్బందీగా నిర్వహించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పది, ఇంటర్ పరీక్షలను మార్చి 13 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్పీ శ్రీధర్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేకుండా

పనిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారులకు కలెక్టర్ సూచన

అమలాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన అమలాపురంలోని కలెక్టరేట్ సమావేశపు హాలులో రానున్న సార్వత్రిక ఎన్నికల నియమావళి, ఎన్నికల వ్యయం వంటి అంశాలపై సమీక్షించారు. ఎన్నికల వ్యయంలో భాగంగా 18 అంశాలకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులతో మొట్టమొదటి సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడ ఏ చిన్న పొరపాటు లేకుండా విధులు నిర్వహించాలని, లేనిపక్షంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే మద్యం, నగదు, పంపిణీలకు ఆస్కారం లేకుండా నోడల్ అధికారులు దృష్టి పెట్టాలని, ఇతర వస్తువులు సీజ్ చేసే సమయంలో అన్ని బృందాలు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు. చెక్ పోస్టుల్లో వాహనాలను నిష్పక్షపాతంగా తనిఖీ చేయాలని, పట్టుబడిన వాటిని ఎన్నికల నియమావళి మేరకు సీజ్ చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. ఎన్నికల మెటీరియల్ నిర్వహణనుడీఆర్వో నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీల సమయంలో పట్టుబడ్డ నగదు, ఇతర వస్తువులకు రశీదులు కచ్చితంగా ఇవ్వాలని, ఆధారాలు చూపిస్తే పట్టుబడిన నగదును విడిపించేందుకు వెసులుబాటు ఉందన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టర్ హిమాన్షు శుక్లా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో గుర్తింపు పొందిన పార్టీలు సహకరించాలని కోరారు. గత వారం రోజులుగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పురోగతిని వివరించారు. చేర్పులు, మార్పులను వెల్లడించారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



- అద్దె గదులు, రేకుల షెడ్డులోనే పాఠాలు
- 170 మంది విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఇదీ గొల్లపుంత కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితి





సిమెంటు బస్తాల నడుమ చదువుకుంటున్న విద్యార్థులు

సిమెంటు బస్తాల నడుమ

తరగతులు

మండపేట, ఫిబ్రవరి 13:
మండపేట పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో గల వేగుళ్ల వీర్రాజు ప్రభుత్వ పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 170 మంది చదువు కుంటున్నారు. తరగతి గదులు కేవలం రెండే ఉండడంతో పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విరాళాలు వేసుకుని అద్దెకు ఇల్లు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మున్సిపాల్టీకి చెందిన మార్కెట్ షెడ్డులో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇక్కడ 'నాడు-నేడు'లో 5 తరగతి గదులు మంజురయ్యాయి. నిధుల కొరతతో పనులు ముందుకు సాగట్లేదు. అసలే వున్న ఇరుకు గదులకు తోడు కొన్ని పాఠశాలల్లో 'నాడు-నేడు' సిమెంట్ బస్తాలు వేశారు. దీంతో అరుగు మీద కూడా పాఠాలు చెప్పే వీల్లేకుండా పోయింది. ఇక్కడ అధికార పార్టీకి చెందిన ఛైర్‌పర్సన్ వార్డులో వున్న పాఠశాల దుస్థితి ఇది. గడ్డకట్టిన నాడు-నేడు సిమెంట్ బస్తాలను తొలగించకపోవడం దారుణం. చాలీచాలని విద్యార్థులు పరాయిపంచన మున్సిపాల్టీకి చెందిన రేకుల షెడ్డుల్లో పాఠాలు చదువుకోవాల్సి వస్తోంది. పాఠశాల రూపురేఖలు మార్చేశామని చెప్తున్న పాలకులు ఈ పాఠశాల గురించి ఏం చెప్తారో వేచి చూద్దాం.



రేకేల షెడ్డులో పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయులు

అన్వేషణ!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- అభ్యర్థుల కోసం టీడీపీ ప్రయత్నాలు
- ఐవీఆర్ఎస్ ద్వారా ఓటర్ల మనోగతం గుర్తింపు
- లోక్‌సభ అభ్యర్థిగా హరీష్ అయితే?
- గత కొన్నిరోజులుగా టీడీపీ వాయిస్ కాల్స్

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో అభ్యర్థుల అన్వేషణపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ ఓటర్ల మనోగతాలను నేరుగా తెలుసుకుంటోంది. ఐవీఆర్ఎస్ ద్వారా ఓటర్లకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలను తెలుసుకుంటోంది. గత కొన్ని రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం లోక్‌సభ, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆశావహులైన అభ్యర్థుల పేర్లతో ఫోన్ కాల్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ పేరుతోమంగళవారం ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ అమలాపురం నియోజకవర్గంతో పాటు వివిధ నియోజకవర్గాల్లో పార్టీ కేడర్‌తో పాటు సెల్‌ఫోన్లు ఉన్న అందరికీ కాల్స్ వచ్చాయి. ముందుగా..మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మీతో మాట్లాడతారు అంటూ వాయిస్ మెస్సేజ్ వచ్చింది. ఆ తర్వాత అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్ అయితే ఎలా ఉంటుంది అంటూ మీకు ఇష్టమైతే 1 నొక్కండి లేదంటే నోటా కోసం 2 నొక్కండంటూ వాయిస్ కాల్ ద్వారా సమాచారాన్ని సేకరించారు. గతంలో అనేక నియోజకవర్గాలకు ఇదే తరహాలో సమాచార సేకరణ జరిగింది. పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ దళిత నేత మహాజన్ రాజేష్ పేరును అలాగే అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి అయితాబత్తుల ఆనందరావు పేరును, కొత్తపేట నియోజకవర్గం నుంచి బండారు సత్యానందరావు పేరును, రామచంద్రపురం నియోజకవర్గం నుంచి రెడ్డి సుబ్రహ్మణ్యం, ఇలా వివిధ నియోజకవర్గాల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఓటర్ల అభిప్రాయాలను టీడీపీ సేకరించింది. అయితే ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌తో పాటు టీడీపీ వేర్వేరుగా నిర్వహించిన సర్వేలతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఫ్లాష్ సర్వేల ద్వారా ఓటర్ల నాడిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆ పార్టీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. గతంలో టీడీపీ కీలక నేతల ఆశీస్సులు, సహకారాలతో టిక్కెట్లు సాధించే ఆశావహులైన అభ్యర్థులకు ఈ సారి సర్వేలు ప్రాణ సంకటంగా మారాయి. ఏ సర్వేలో ఎవరికి బావుందో తెలుసుకునేందుకు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో టిక్కెట్లు ఆశిస్తున్న కొందరు కీలక నేతలు పైరవీలు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

దేవుడికే శఠగోపం!

కౌలు భూముల వేలంలో నిబంధనలు తూచ్

కారు చౌకగా వేలం భూములు

కౌలుకు అప్పగింత

ఆత్రేయపురం, ఫిబ్రవరి 13: ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరీ రాజరాజేశ్వర వేణుగోపాలస్వామి ఆలయ భూముల వేలంలో రైతులకు కారు చౌకగా భూములు అప్పగించి దేవుడి ఆదాయానికి శఠగోపం పెట్టారు. దేవదాయ, ధర్మదాయ చట్టంలోని నిబంధనలను గాలికి వదలి కౌలు రైతులకు మేలు చేకూర్చారు. ఆత్రేయపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ధూప, దీప నైవేద్యాల నిమిత్తం స్వామివారికి సుమారు 28 ఎకరాల విలువైన భూమిని పూర్వీకులు సమకూర్చారు. దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ విలువైన భూముల సాగుకోసం ప్రతిఏటా బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన పాటలలో 28 ఎకరాలకు సుమారు 20 మంది రైతులు రూ.15లక్షలకు పోటాపోటీగా వేలం పాడి సాగు చేసుకున్నారు. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి ఈ నెల 11న ఆలయ ప్రాంగణంలో స్వామివారికి చెందిన 28 ఎకరాల కౌలు సాగుకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. అధికార పార్టీ నేతల సహకారంతో అక్కడికి ఎవ్వర్నీ రానివ్వకుండా కొన్నేళ్లుగా సాగు చేస్తున్న రైతులకే కారు చౌకగా భూములను కౌలు వేలం పాటలో అధికారులు సహకరించిన తీరు చూసి భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. పక్క గ్రామంలో ఉన్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములకు సంబంధించి ఎకరా రూ.80 వేల నుంచి రూ.లక్షకుపైగా కౌలు చిత్తులు వస్తున్నాయి. ఇక్కడ మాత్రం ఎకరా రూ.30వేల నుండి రూ.40వేలకు కౌలు ధరలు తగ్గించి అప్పగించిన తీరు చూసి భక్తులు ఇదెక్కడి ధర్మం స్వామి అని ముక్కున వేలు వేసుకుంటున్నారు. ప్రతిఏటా దేవుడి భూముల కౌలు వేలం ద్వారా ఆదాయం పెరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఆత్రేయపురం వేణుగోపాలస్వామిఆలయ భూములకు కౌలు ధర తగ్గించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌలుదారులతో దేవదాయ శాఖాధికారులు కుమ్మక్కై ధరలను ఇష్టానుసారంగా తగ్గించడంతో ఆలయ ఆదాయానికి గండిపడింది. ఇటీవల నిర్వహించిన వేలంపాటల్లో అధికార పార్టీ నేతల అండదండలతో నిర్వహించిన వేలం పాటలలో జరిగిన అక్రమాలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ జరిపి స్వామివారి ఆదాయం పెరిగే చర్యలు చేపట్టాలని ధార్మిక సంఘాలు కోరుతున్నాయి.

ప్రచార ఆర్భాటం

- ఎన్నికల ప్రచార వేదికగా ఆసరా చెక్కుల పంపిణీ సభ
- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు డుమ్మా
- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, నేతలతో కలిసి నిర్వహణ
- సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన డ్వాక్రా మహిళలు
- సభ నుంచి వెళ్లిపోతే రుణాలు మంజూరు చేయమన్న డ్వాక్రా యానిమేటర్లు
- లెక్కచేయని మహిళలు... సభ నుంచి తిరుగుబాటు





సభ జరుగుతుండగా మధ్యలో వెళ్లిపోతున్న డ్వాక్రా మహిళలు



అంబాజీపేటలో సభా వేదిక వద్దకు మహిళలను తీసుకువెళ్తున్న డ్వాక్రా యానిమేటర్

అంబాజీపేట, ఫిబ్రవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎన్నికల ప్రచార వేదికగా మారింది. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌తో కొనసాగించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉండగా ఆయన దూరంగా ఉన్నారు. దీంతో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సభికులు వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా నిర్వహించడంతో డ్వాక్రా మహిళలు అసహనం వ్యక్తం చేశారు. సభా వేదికపై ప్రజాప్రతినిధులు తప్ప మండల స్థాయి అధికారులు కనిపించలేదు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేయాలని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచార వేదికగా సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ఎక్కువగా ప్రభుత్వంపై గొప్పలు చెపుతూ మాట్లాడుతున్న సమయంలో మహిళలు సభ మధ్యలోంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభం నుంచే మహిళలు ఒక్కొక్కరిగా వెళ్లిపోవడం కనిపించింది. వారిని యానిమేటర్లు అడ్డుకుని మధ్యలో వెళ్లిపోతే డ్వాక్రా రుణాలతో పాటు రుణమాఫీ కూడా అందకుండా చేస్తామని మహిళలను హెచ్చరించారు. యానిమేటర్ల హెచ్చరికను ఏ మాత్రం లేక్కచేయని మహిళలు సభ నుంచి నిష్క్రమించారు.

అనంతరం అక్కడ ఉన్న కొద్దిమంది మహిళలతో సభను నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాలకు చెందిన 1287 గ్రూపులకు సంబంధించి 12,467 మందికి 9.70 కోట్లు ఆసరా చెక్కును మహిళలకు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గంగాధర్, సొసైటీ ఛైర్మన్ దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ ఛైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఛైర్మన్ నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీభార్గవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, నాయకులు ఎంఎం శెట్టి, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, ఉందుర్తి నాగబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.


వినాయకునికి సప్త నదీ జలాలతో అభిషేకిస్తున్న అర్చకులు

వైభవంగా సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి13: బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పం, సప్తనదీ జల మండపారాధన, మహన్యాసం, సప్తనదీ జలాలతో స్వామివారికి అభిషేకం, లక్ష దూర్వార్చన, లక్ష్మీగణపతి అష్టద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.50 కోట్లు నిధులు: ఎంపీ అనురాధ


అల్లవరం, ఫిబ్రవరి13: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసిందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ తెలిపారు. ఎటువంటి అపోహలు వద్దని, రైల్వేలైను నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ రైల్వేలైన్‌కు ఇప్పటివరకు రూ.1,409 కోట్లు సాధించామన్నారు. ఈ ఏడు కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు, రైల్వే ట్రాకుల మరమ్మతులకు రూ.10 కోట్లు, భూసేకరణకు రూ.50 కోట్లు కేటాయించినట్టు ఎంపీ కార్యాలయం తెలిపింది.

నేడు కాంగ్రెస్ ఉభయగోదావరి జిల్లాల సమీక్ష

పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి



పెరవలి, ఫిబ్రవరి13: ఉభయగోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్షా సమావేశం ఈనెల 14న ఉదయం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు గేటు వద్ద ఉన్న సాయి కల్యాణ మండపంలోని జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రటరీ మయ్యప్పన్, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఉభయగోదావరి జిల్లాల పార్టీ పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ హాజరవుతారన్నారు. జిల్లాలోని నగర, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం, అనుబంధ సంస్థల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు హాజరవ్వాలని కోరారు.



విద్యుదుత్పత్తి నిలిపివేత

మోతుగూడెం, ఫిబ్రవరి13: సీలేరు కాంప్లెక్స్‌లో మూడు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తుండడంతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో ఏపీ వాటాగా 19.92 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 12.81 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గోదావరి డెల్టాకు డొంకరాయి నుంచి 4వేల క్యూసెక్కుల నీటి నిల్వలు వెళ్తున్నాయి. ప్రస్తుతం గోదావరి డెల్టాకు నీటి అవసరం లేదని జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. దీనితో జెన్‌కో అధికారులు నీటిని పొదుపుగా ఉపయోగిస్తున్నారు. రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి సీలేరు కాంప్లెక్స్‌లో ఉత్పత్తిని నిలుపుదల చేసి, జలాశయాల్లో నీటిని పొదుపు చేస్తున్నారు.

ఒకే ప్రశ్నపత్రం.. ఒకేరోజు డీఎస్సీ నిర్వహించాలి

▸▸ ఆన్‌లైన్ పరీక్షా విధానంతో అభ్యర్థులకు తీవ్ర నష్టం ▸▸ ఉపాధ్యాయ చరిత్రలో మినీ డీఎస్సీ ఇదే : ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13: ఆన్‌లైన్ పరీక్షా విధానం డీఎస్సీ ఉద్యోగార్థులకు తీవ్ర నష్టదాయకమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిందని, ఒక్కోరోజు ఒక్కో అభ్యర్థికి ఒక్కో ప్రశ్నపత్రంతో పరీక్షలు నిర్వహిస్తే కామన్ మెరిట్ ఎలా తీస్తారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులందరికీ ఒకే ప్రశ్నపత్రంతో ఒకేరోజు పరీక్ష నిర్వహించాలని డిమాండు చేశారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ ప్రభుత్వ తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. పాదయాత్రలో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ వేస్తామని నమ్మించి జగన్ ఓట్లు వేయించుకుని ఐదేళ్ల తరువాత మళ్లీ ఎన్నికల వేళ 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఉపాధ్యాయ చరిత్రలో అతి తక్కువ సంఖ్యతో మినీ డీఎస్సీ ప్రకటించడం జగన్ మోసపూరిత చర్యగా అభివర్ణించారు. జగన్ పాలనలో 6,100 పోస్టులు అంటే మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసినట్టా లేక ఉపాధ్యాయ పోస్టులు అవసరం లేదా అని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండు చేశారు.

అప్రంటీస్ దుర్మార్గపుచర్య

1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఉపాధ్యాయులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల 16 ఏళ్ల పోరాటాల ఫలితంగా 2010లో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేశారని ఐవీ చెప్పారు. 2012 నుంచి రెగ్యులర్ నియామకాలు జరిగాయన్నారు. మళ్లీ ఆ విధానాన్ని జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. నిబద్ధతతో కూడిన శిక్షణకోసం అప్రంటీస్ విధానం ప్రవేశపెట్టామని మంత్రి బొత్స చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21,585 కోట్ల బకాయిల్లో రూ.5,500 కోట్లు మార్చి నెలాఖరుకు చెల్లిస్తామంటున్న ప్రభుత్వం మిగిలిన బకాయిలను వచ్చే ప్రభుత్వం పైకి గెంటేస్తోందన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించని జగన్ ప్రభుత్వం 12వ పీఆర్సీ ఎప్పుడు అమలుచేస్తుందని, దీనిపై ఉద్యోగులంతా ఆందోళన చెందుతున్నారని ఐవీ అన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల జయకేతనం


అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో చైర్మన్ నున్న

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో రాజమహేంద్రవరంలోని కాతేరు తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సోమవారం సాయంత్రం విడుదలైన జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు యు.సుధీర్, ఎన్.యశ్వంత్, ఎంజీవీ మహేష్ 99.99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. అలాగే 14 మంది 99.90 పర్సంటైల్, 158 మంది 99.0 పర్సంటైల్, 282 మంది 98 పర్సంటైల్, 606 మందికి 95 పర్సంటైల్, 1022 మందికి 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. సుమారు 950 మంది పైనే విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ లేదా ఐఐటీలో సీట్లు సాధిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు అఖిలభారత స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు బి.రఘురామసహన్ 99.95, జి.జగదీష్‌వెంకటసీతారామ్ 99.95, ఏహెచ్ సత్యనిహంత్ 99.94, ఏ.చరణ్‌ఉమేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారన్నారు. అంతేకాకుండా 62 మంది విద్యార్థులు 99.00 పర్సంటైల్‌పైన సాధించి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో షిర్డిసాయి హవా



విద్యార్థులను అభినందిస్తున్న షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరం షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. ఈ వివరాలను షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. తమ కళాశాల లక్ష్యా అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.తనుశ్రీ 99.9 పర్సంటైల్, జె.శ్రీకర్ 99.8, సీహెచ్ బానువెంకటదీపక్ 99.6, ఎం.తాత్త్విక్‌సాయి 99.4, కె.ప్రదీప్‌శ్రీసత్య 99.4, బి.లక్ష్మణనాయుడు 99.3 పర్సంటైల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఆరుగురు విద్యార్థులు 99శాతంపైగా పర్సంటైల్, 15 మంది 98 పైగా, 28 మంది 97పైగా, 53 మంది 95పైగా పర్సంటైల్ సాధించినట్లు శ్రీవిద్య తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ టి.శ్రీధర్ మాట్లాడుతూ తమ విద్యార్థుల్లో 163 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. విజేతలైన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యాడీన్ చంద్రశేఖర్‌లు అభినందించారు.

'మేము వైసీపీ కోసమే పనిచేస్తున్నాం'

ఆత్మీయ సమ్మేళనంలో ఓ మహిళా వలంటీర్ వ్యాఖ్య


రౌతులపూడిలో మాట్లాడుతున్న మహిళా వలంటీర్

రౌతులపూడి, ఫిబ్రవరి 13: వలంటీర్లలంతా కేవలం రూ.5 వేల కోసం పనిచేయడం లేదని, వైసీపీ కోసం పనిచేస్తున్నామని రౌతులపూడికి చెందిన సచివాలయం-1 వలంటీర్ అనడం చర్చనీయాంశంగా మారింది. కాకినాడ జిల్లా రౌతులపూడికి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండల వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు హాజరయ్యారు. రౌతులపూడి సచివాలయం-1 వలంటీర్ మాట్లాడుతూ వలంటీర్‌గా పీజీలు, డిగ్రీలు చేసిన వారు కేవలం రూ.5 వేల జీతం కోసం కాదని, జగన్ అంటే ఎవరో మాకు తెలియదని, జగన్‌ను తామె చూడలేదని.. అయినా తామంతా కేవలం వైసీపీ కోసం పనిచేస్తున్నామని, మళ్లీ ప్రభుత్వం వస్తే తమను గుర్తించి ఉన్నతస్థాయిలో నిలబడతారని అని పేర్కొంది. మిగిలిన వలంటీర్లు కూడా మాట్లాడుతూ వైసీపీకే పనిచేస్తామని తెలిపారు. అలాగే జడ్పీటీసీ గొల్లు దివాణం వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ మీ పరిధిలోని ప్రతి 50 కుటుంబాలు వైసీపీకి ఓటు వేయించే బాధ్యత మీదేనన్నారు. వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ నెగ్గేలా చూడాలని వలంటీర్లను కోరారు.

భర్త చేతిలో.. భార్య హత్య



హత్యకు గురైన దుర్గ.. (పక్కన) ఫైల్‌ఫొటో

▸▸ కుండలేశ్వరంలో ఘటన

▸▸ ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట

కాట్రేనికోన, ఫిబ్రవరి 13: ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్న భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. కుండలేశ్వరం పంచాయతీ టన్నెల్‌పేట గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం సోముదేవరపాలేనికి చెందిన పెయ్యాల ఈశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె దుర్గను కాట్రేనికోన మండలం కుండేశ్వరం పంచాయతీ టన్నెలుపేటకు చెందిన జొన్నాడ దుర్గాప్రసాద్ ప్రేమించుకుని పెద్దల సమక్షంలో 2022 డిసెంబరు 10నలో వివాహం చేసుకున్నాడు. ఏవిధమైన కట్న కానుకలు ఇవ్వలేదు. పెళ్లయిన తర్వాత నుంచి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం భార్యభర్తలు గొడవపడ్డారు. ఈ ఘటనలో దుర్గ మృతి చెందింది. భార్య దుర్గను భర్త దుర్గాప్రసాద్ కొట్టడంతో చనిపోయిందని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. దుర్గ సోదరుడు పెయ్యల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్.. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి



కొవ్వూరు, ఫిబ్రవరి 13: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన జలాది శిరీష్‌కుమార్ (35) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్. మూడు రోజుల కిందట బంధువులను పరామర్శించడానికి ఇంటికి వచ్చాడు. ఈనెల 12న ధవళేశ్వరం బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకుని తిరిగి పల్సర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మార్గమధ్యంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు వైపు బైక్ అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిపోయిన శిరీష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిరీష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. ఈ ప్రమాదంతో మల్లవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

గురుకుల పాఠశాల స్థితిగతులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

రెడ్డి సుబ్రహ్మణ్యం


విద్యార్థులు, అధికారితో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13: రామచంద్రపురం మండలం ఆదివారపుపేట బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, పాఠశాలలో స్థితిగతులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం ఆదివారపుపేటలో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలు, తాగునీరు, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో తనిఖీలకు వచ్చిన ఫుడ్‌సేఫ్టీ అధికారితో ఆయన మాట్లాడారు. తాను తనిఖీలకు వచ్చి రెండేళ్లు అయిందని చెప్పగా ఆయనపై రెడ్డి సుబ్రహ్మణ్యం అసహనం వ్యక్తంచేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందితో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగితే తల్లిదండ్రులపై నెపం వేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో రక్షితమంచినీరు లేకపోవడంతో బోరు నీరు తాగడంతో విద్యార్థులు అస్వస్థతకు కారణమని ఆరోపించారు. 500 మంది పేద పిల్లలు చదువుకునే గురుకుల పాఠశాలకు రక్షిత మంచినీరు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. పిల్లలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని, మెను ప్రకారం భోజనాలు పెట్టాలని లేనిపక్షంలో టీడీపీ తరఫున ఉద్యమం చేస్తామన్నారు. జిల్లా కలెక్టరు సంఘటనపై స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కల రిష్యంత్‌రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకె సాంబశివరావు, టీడీపీ నాయకుల సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : పీడీఎస్‌యూ

పాఠశాలను సందర్శించిన పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, స్టూడెంట్స్ జేఏసీ నాయకుడు ప్రత్తిపాటు బులిరాజు తదితరులు మాట్లాడుతూ నాణ్యతలేని చికెన్, గుడ్డు వల్ల ఫుడ్‌పాయిజన్ జరిగిందన్నారు. నాడు-నేడులో రూ.50 లక్షలు రక్షిత మంచినీటికి కేటాయించినా రక్షిత మంచినీరు అందడం లేదన్నారు. ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టు రద్దు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావును సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు.

ఆసుపత్రి నుంచి విద్యార్థుల డిశ్చార్జి

కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిన 8 మంది విద్యార్థులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. వారి ఆరోగ్యం కుదుట పడటంతో విద్యార్థులను పంపివేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు తెలిపారు. కాగా మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో విద్యార్థులకు మలం పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితోపాటు వాహనాలు, నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మోతుగూడెం, ఫిబ్రవరి 13: రెండు వేర్వేరు కేసుల్లో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. గంజాయి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. నెల్లూరుకు చెందిన షేక్ వరీజ్, షేక్ సుభాని, సూరిపోగు లక్ష్మీసాయి వెంకట్ రెండు వాహనాల్లో 20 కిలోల గంజాయిని ఒడిసా నుంచి తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే గుంటూరుకు చెందిన జిన్నాబత్తిన భరత్, సింగపల్లి చరణ్, మేడికొండూరు విశాల్‌కుమార్, షేక్ మస్తాన్ కలిసి ఒడిసా నుంచి కారులో రెండు కిలోల గంజాయిని తీసుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టుచేసి, 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అదృశ్యమైన గురుకుల విద్యార్థులు కాకినాడలో లభ్యం


పోలీస్‌స్టేషన్ వద్ద అదృశ్యమైన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అల్లవరం, ఫిబ్రవరి 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి సోమవారం అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులను కాకినాడ బస్టాండు వద్ద రూరల్ సీఐ పి.వీరబాబు నేతృత్వంలో అల్లవరం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన మెల్లం నాగేంద్రబాబు, కాట్రేనికోన మండలం బట్టుచెరువుకు చెందిన గుర్రాల టోనీబాబు గోడి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం వారిద్దరూ కనిపించకుండా వెళ్లిపోయారని ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ అల్లవరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం గాలింపు చర్యలు చేపట్టింది. కాకినాడ బస్టాండులో వారిని గుర్తించి అల్లవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ప్రిన్సిపల్ సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ వీరబాబును, అల్లవరం పోలీసులను ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

నాపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం

తూర్పు ఎస్పీకి ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు గీత ఫిర్యాదు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా తనపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారంతో పరువుకు నష్టం కలిగించేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. మానసికంగా వేధిస్తున్నారని మాజీ ఎంపీ, ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీశ్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. "నాకు 53 ఏళ్లు. డిప్యూటీ కలెక్టర్‌గా కూడా పని చేశాను. నా తండ్రి వాల్మీకి కులానికి చెందినవారు. ఆయన కూతురుగా నేను కూడా అదే కులానికి చెందుతానని 2017లో డీఎల్ఎస్‌సీలో కలెక్టర్ ఆదేశాలిచ్చారు. గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చింది. చట్ట ప్రకారం గెజిట్‌ని చాలెంజ్ చేసే ప్రొవిజన్స్ లేవు. కానీ కొందరు పలుకుబడి ఉపయోగించి కేవలం స్వలాభం కోసం నా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌పై ఒక ఆర్డర్ తీసుకొచ్చారు. దానిపై కోర్టును ఆశ్రయించాం. కోర్టు ఆ ఆదేశాలను సస్పెండ్ చేసింది. అందువల్ల గెజిట్ ప్రకారం నేను వాల్మీకి అన్నదే నిలుస్తుంది. ఎవరూ కూడా దానిని చాలెంజ్ చేయలేరు. గెజిట్ ఒకసారి విడుదలైన తర్వాత దానిపై ఎలాంటి చర్యలూ చేపట్టే అధికారం ప్రభుత్వానికి లేదు. ఎందుకంటే డిస్ట్రిక్ట్ లెవెల్ సెలక్షన్ కమిటీ(డీఎల్ఎస్‌సీ) ఉత్తర్వులే ఫైనల్. ఈ పరిస్థితుల్లో పని కట్టుకుని గతంలో బీజేపీ ఎంపీగా పోటీ చేసిన కాశీ విశ్వనాథ్ సత్యనారాయణరెడ్డి కేవలం స్వలబ్ధితో అసహ్యకరమైన కామెంట్స్ చేయడంతోపాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. మానసిక వేదనకు గురిచేస్తున్న నిమ్మక జయరాజు గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆదివాసీ అసోసియేషన్‌ని జయరాజు పెట్టారు. దానిని రేగు మహేశ్వరరావు, ఈలి ఆంజనేయులు అనే గిరిజనేతరులు నిర్వహిస్తున్నారు. ఆ సోసియేషన్ ఆదివాసీల మేలు కోసం చేసిన పనులేమీ లేవు. అన్నీ బ్లాక్ మెయిలింగ్ పనులే చేస్తోంది. ఆ అసోసియేషన్‌పై జ్యుడీషియల్ విచారణకు హైకోర్టును ఆశ్రయిస్తున్నాను. పరువు నష్టం దావా వేస్తాను. అరకులో బ్యాంక్ లోన్ తీసుకొని ఎగ్గొట్టేశామని దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యాపారంలో లోన్లు తీసుకోవడం సర్వసాధారణం. తర్వాత కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. రూ.25 కోట్లు అప్పు తీసుకుంటే వడ్డీతోసహా రూ.65 కోట్లు పూర్తిగా చెల్లించాం. లోన్ తీరినట్టు బ్యాంక్ క్లియరెన్స్ లెటర్ కూడా ఇచ్చింది. అవన్నీ కోర్టులో ఫైల్ చేశాం. మేము బ్యాంకును మోసం చేశామని ప్రచారం చేస్తున్నారు" అని ఆమె వివరించారు. వీటన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశానని, కోర్టును కూడా ఆశ్రయిస్తానని తెలిపారు.

ఆటో చోరీ కేసులో నిందితులకు 6 నెలల జైలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి13: ఇంటి ముందు పార్కుచేసిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్టు పి.రమణ ఫిర్యాదుమేరకు గత సంవత్సరం జూన్‌లో అప్పటి సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి పి.రవివర్మ, పి.దుర్గాప్రసాద్, పి.స్వాతిలను అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన విచారణ జరిపి నిందితులను 3వ అదనపు జ్యూడీషియల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి సి.రమ్య ముగ్గురు ముద్దాయిలకు ఆరు నెలలు జైలుశిక్ష విధించినట్టు ప్రస్తుత సీఐ జీవీ వినయ్‌మోహన్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషిచేసిన ఏపీపీ కేఎస్ఎస్ లక్ష్మిదేవి, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌లను డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ వినయ్‌మోహన్‌లు అభినందించారు.

రేపు అమలాపురంలో పవన్ పర్యటన?

నాలుగు నియోజకవర్గాల నేతలతో సమావేశాలు


సమావేశమైన డీఎంఆర్ శేఖర్, జనసేన నేతలు

అమలాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 15న కోనసీమ కేంద్రమైన అమలాపురంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం ఆయన టూరుకు సంబంధించి ప్రాథమిక షెడ్యూల్ విడుదలైంది. తొలుత భీమవరంలో పర్యటన ముగించుకుని బుధవారం రాత్రికి అమలాపురం చేరుకుంటారని సమాచారం ఉండగా, అనుమతులు రాకపోవడంతో అక్కడ రద్దయింది. అయితే 15వ తేదీ ఉదయం పవన్ ఇక్కడకు చేరుకుంటారని సమాచారం. షెడ్యూల్ ప్రకారం నాలుగు నియోజకవర్గాల నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తారు. అమలాపురం నియోజకవర్గంలోని క్రైస్తవులతో 9.30 గంటల నుంచి గంటసేపు సమావేశమవుతారు. ఆ తర్వాత జనసేన ముఖ్య నేతలతో 10.30 నుంచి 11.30 గంటల వరకు భేటీ అవుతారు. 11.30 నుంచి 12.30 గంటల వరకు అమలాపురం, రాజోలు నియోజకవర్గాల టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు రాజోలు నియోజకవర్గ ముఖ్య నాయకులు 40 మందితో, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అయితే ఈ పర్యటనను బుధవారం మరోసారి ధ్రువీకరిస్తారు. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనకు అడ్డంకులు కల్పించడాన్ని ఆ పార్టీ కేడర్ తీవ్రంగా పరిగణిస్తోంది. హెలికాప్టర్ దిగేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు అభ్యంతరం చెప్పడం వెనుక ప్రభుత్వం కుట్ర ఉందనే ఆగ్రహంతో కొందరు యువకులు మంగళవారం రాత్రి అమలాపురంలో కలెక్టరేట్ వద్ద భారీగా గుమిగుడారు. అధికారులెవ్వరూ లేకపోవడంతో వెనుతిరిగారు. మరోవైపు జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో స్థానికంగా ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. మరోవైపు జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో ఆయన వర్గీయులు హైస్కూలు సెంటర్‌లోని కన్వెన్షన్ హాలులో మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అంబాజీపేట, ఫిబ్రవరి 13: ఇరుసుమండ పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి అధ్యక్షతన నిర్వహించగా జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి ప్రారంభించారు. ముక్కామల పీహెచ్‌సీ వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దారు జె.విమలకుమారి, సీహెచ్‌వో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి, నాయకులు అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యసమితి నూతన కార్యవర్గం

మలికిపురం, ఫిబ్రవరి 13: రాజోలు నియోజకవర్గ పరిరక్షణ చైతన్య సమితి అధ్యక్షుడిగా నల్లి ప్రసాదరావు ఎంపికయ్యారు. మంగళవారం గెద్దం బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా మంద సత్యనారాయణ, కోశాధికారిగా పోతుల శేఖర్‌నాథ్‌లతో పాటు మరో పది మందిని కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో రాజోలు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తీర్మానించారు. చింతా సత్య, విప్పర్తి సాయిబాబు, రాపాక కిరణ్, బూసి జాన్‌మోషే తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 13: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్యంగా వుండవచ్చని టీడీపీ నాయకుడు, ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో కలుషిత ఆహారం తీసుకుని చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడిని, ఇతర డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో గుబ్బల ఈశ్వరప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ వి.వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దారుగా వెంకటరామయ్య



ఆత్రేయపురం, ఫిబ్రవరి 13: ఆత్రేయపురం తహసీల్దారుగా ఎం.వెంకటరామయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. వెంకటరామయ్యను రెవెన్యూ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

తహశీల్దార్‌గా సాయికృష్ణ



కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 13: కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా కె.సాయికృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పాలకొల్లు నుంచి ఆయన ఇక్కడ వచ్చారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సాయికృష్ణను కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కె.సూర్యారావు కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

కె.గంగవరం, ఫిబ్రవరి 13: ప్రజలు ప్రలోభాలకు లోనకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని రామచద్రపురం సీఐ పి.దొరరాజు అన్నారు. మంగళవారం ఆయన సుందరపల్లిలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పామర్రు ఎస్ఐ జానీబాషా, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు రహదారి నియమాలు పాటించాలి: డీటీవో

రావులపాలెం, ఫిబ్రవరి 13: రహదారులపై వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలు పాటించాలని డీటీవో అశోక్ ప్రతాపరావు కోరారు. రహదారిభద్రతా మాసోత్సవాల్లో భాగంగా రావులపాలెంసత్యసాయి విద్యా సంస్థల్లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ ఆసుపత్రి సిబ్బంది 300మంది క్యాబ్, ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు ఈసీజీ, బ్లడ్, షుగర్ టెస్టులు నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంవీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీటీవో అశోక్ ప్రతాపరావు మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు పాటించాల్సిన భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ కేవీ నాగేంద్ర, సత్యసాయి విద్యా సంస్థల డైరెక్టర్ నడింపల్లి రవిచంద్ర పాల్గొన్నారు.

గురుకులానికి ఇన్వర్టర్, బ్యాటరీ బహూకరణ

అల్లవరం, ఫిబ్రవరి 13: సరస్వతమ్మ-ముత్యాలు చారిటబుల్ ట్రస్టు తరఫున టీఎస్ఎన్ మూర్తి బాలికల గురుకుల పాఠశాలకు రూ.30వేలు విలువైన ఇన్వర్టర్, బ్యాటరీలను ప్రత్యేక కార్యదర్శి ఐఆర్ఎస్ ఉన్నతాధికారి టీఎస్ఎన్ మూర్తి బహూకరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ గునిశెట్టి చినబాబు, నాతి శ్రీనివాసరావు, తాళ్ళ సాంబమూర్తి, బొంతు శ్రీను, బళ్ళ కమలతేజ పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా పరిహారం ఆపలేరు

- ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు
- సీఎంతో ఓఎన్జీసీ పరిహారంపై సమీక్ష

యానాం, ఫిబ్రవరి 13: యానాంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అడ్డుకునేందుకు ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా అడ్డుకోలేరని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పుదుచ్చేరిలో ఉన్న ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పరిహారం విషయంలో కొందరు ద్వంద్వ వైఖరిగా వ్యవహరిస్తున్నారని, ప్రజల దగ్గర ఒకమాట, అధికారులు, ఓఎన్జీసీ అధికారుల దగ్గర మరో మాట మాట్లాడుతున్నారని అన్నారు. చమురు సంస్థ పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమచేసే సమయంలో పరిహారం వేయకుండా ఏంచేశారో, జీవో వస్తేనే విడుదల చేయండని ఎవరు చెప్పారో అన్ని



సీఎం నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

తనకు తెలుసన్నారు. దీనికి సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం సీఎం రంగసామి నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కలెక్టర్, డీజీపీ, మత్స్యశాఖ, ఎల్ఏడీ శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు. పరిహారానికి సంబంధించి జీవో ఫైల్‌పై సీఎం, ఇతర అధికారులు సంతకాలు చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపడంతో పాటు గురువారం గవర్నర్‌కు పంపేలా నిర్ణయించారు.

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణలు ఫోన్‌లో పరిహారానికి సంబంధించి ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడారు. పరిహారం తక్షణం ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని కోరారు. బుధవారం నాటికి ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తే, శుక్రవారం నాటికి ప్రభుత్వ జీవో విడుదల చేస్తుందన్నారు. పరిహారం లబ్ధిదారులకు ఇచ్చిన నాటి నుంచి 15రోజుల్లోగా యూసీ ఇస్తామన్నారు. ఎన్నికల కోడ్ రాకుండా పరిహారం ఇచ్చేందుకు ఓఎన్జీసీ అధికారులు మరింత సహకరించాలని కోరారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందంజ

అల్లవరం, ఫిబ్రవరి 13: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆకెళ్ల సుబ్బలక్ష్మి, బి.రమణమ్మ, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి



కొత్తపేట, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం రైతులకు అమలుచేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని పొందాలంటే ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో 16వ విడత పొందేందుకు ఈకేవైసీ చేయించుకున్న రైతులు అర్హులవుతారన్నారు. నియోజకవర్గంలో ఈనెల13నుంచి 21వరకు అధికారులు ఈ-కేవైసీ నమోదు చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



టేకిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 13: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, వైసీపీ అరాచక పాలనకు విసుగుచెందిన ప్రజలు ఆ పార్టీని అంతమొందించేందుకు ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. టేకిలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం నిర్వహించిన బాబుష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్నివ్యవస్థలు నిర్వీర్యంగా మారాయని విమర్శించారు. పార్టీ గ్రామంలో శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయనకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టం కట్టాలని కోరారు. టీడీపీ నాయకులు గుడాల జయబాబు, సీహెచ్ రామకృష్ణ, ఎం.శ్రీను, కె.రామారావు, వి. సత్యనారాయణ, ఎ.రామకృష్ణచౌదరి, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏటిగట్టు రోడ్డుపై పారిశుధ్యం అధ్వానం

- వాడపల్లి ఆలయ సమీపంలోని ఏటిగట్టుపై కంపుకొడుతున్న అపారిశుధ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఏటిగట్టు సమీపంలో పార్కింగ్ ఏర్పాటుచేశారు. కాలినడకన ఏటిగట్టు మీదుగా భక్తులు వస్తున్నారు. మొక్కులు తీర్చుకునే భక్తులు తలనీలాలు సమర్పించుకుని గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు ఏటిగట్టు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామపంచాయతీ నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య చర్యలు కానరావడంలేదు. భక్తులు తిరిగే ప్రాంతంలోనే డంపింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్తాచెదారాలను అక్కడే వేసి వెళ్లిపోతున్నారు. దీంతో భక్తులు కంపును భరించలేకపోతున్నారు. దోమలు పెరగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దేవస్థానం జోక్యం చేసుకుని పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయ సమీపంలోని ఏటిగట్టుపై కంపుకొడుతున్న అపారిశుధ్యం

సఫాయి కార్మికుల సంక్షేమం కోసం 'నమస్తే' పథకం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13: సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లు, మలమురుగులు శుభ్రపరిచే కార్మికుల సంక్షేమం కోసం అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం వద్ద నమస్తే పథకంలో సఫాయి కార్మికుల వివరాల నమోదుకు మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎస్.మనోహర్ మాట్లాడుతూ అమలాపురం పురపాలక సంఘంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న సఫాయి కార్మికులందరూ నమస్తే పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈపథకం ద్వారా రూ.30లక్షల వరకు ప్రమాద బీమా, ఉచిత వైద్యం కోసం ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డులు, కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, బ్యాంకు రుణాలు, కార్మికుల భద్రత, జీవనోపాధి కోసం శిక్షణ వంటి ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వచ్చిన నమస్తే స్కీం స్టేట్ కోఆర్డినేటర్ ఎం.వినజయతేజ మాట్లాడుతూ నమస్తే పథకానికి ఆన్‌లైన్‌లో సఫాయి కార్మికులు వివరాలు నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, నియమ నిబంధనలను వివరించారు. రెడ్డి సత్యనారాయణ, ఏఈ కె.వెంకటేష్, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

కె.గంగవరం, ఫిబ్రవరి 13: అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఆయన కె.గంగవరంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో పర్యటనలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణపై సమాలోచనలు చేశారు. పార్టీ నాయకులు సలాది రమేష్, మరివాడ సూరిబాబు, అల్లూరి దొరబాబు, నేమాని అబ్బు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే దశలవారీ ఉద్యమం

ముమ్మిడివరంలో జేఏసీ సమావేశం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 13: డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులంతా బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియచేయాలని ముమ్మిడివరం తాలూకా జేఏసీ సమావేశం పిలుపునిచ్చింది. ముమ్మిడివరం సబ్‌ట్రెజరీ కార్యాలయం వద్ద సుంకర శ్రీహరి అధ్యక్షతన జేఏసీ ముమ్మిడివరం తాలూకా సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల27వరకు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. దశలవారీ ఉద్యమంలో భాగంగా బుధవారం ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మికులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయాలని వారు తీర్మానించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 2018 నుంచి ఇప్పటివరకు రావాల్సిన డీఏ, డీఆర్, జీపీఎఫ్, జడ్పీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ ఏరియర్స్ నూతన పీఆర్సీ పేస్కేలు, టీఏ, డీఏ, డబ్ల్యూఆర్ఐ తదితర డిమాండ్లను తక్షణం పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో దశలవారీ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. బుధవారం జరిగే నిరసన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు రైస్‌కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని వారు డిమాండు చేశారు. సమావేశంలో పెద్దిరెడ్డి రామకృష్ణారావు, జనిపల్లి సత్యనారాయణ, వీవీవీ సత్యనారాయణరాజు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, పి.హిమబిందు, కోలా కృష్ణ, వీవీ అరుణ్‌కుమార్, జె.బాలప్రసన్న, జెసీహెచ్ భైరవస్వామి, బీర కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో సమావేశమైన జేఏసీ

ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలి



కొత్తపేటమండల ఉద్యోగ జేఏసీ ఉద్యమ కార్యాచరణ పోస్టరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తపేట, ఫిబ్రవరి 13: ఏపీ జేఏసీ ఈనెల14 నుంచి 27వరకు చేపట్టే ఉద్యమ కార్యాచరణను ప్రతి మండలంలోని జేఏసీ సభ్యులు విజయవంతం చేయాలని జేఏసీ మండల ఛైర్మన్ ఎం.రామారావు కోరారు. మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఉద్యమ కార్యాచరణ అమలుపై జేఏసీ మండల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఉద్యోగులకు బకాయిలు పడ్డ ఆర్థిక విషయాలు సాధనకై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు నల్లా వెంకటరామారావు, వై.సత్తిరాజు, టి.విజయకృష్ణ, ఎ.రామచంద్రప్రసాద్, సూర్యారావు, జి.రామకుమార్, కె.శామ్యూల్‌రాజు, ఎస్.రుద్రరాజు, ఎస్.శివరామరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో రూ.2కోట్ల విద్యుత్ సామగ్రి చోరీ

నివాసాలు లేని గృహాల్లో దఫదఫాలుగా చోరీ

మండపేట, ఫిబ్రవరి 13: మండపేట గొల్లపుంతలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో ఇటీవల దఫదఫాలుగా దొంగలుపడి రూ.2కోట్ల విలువైన విద్యుత్ వైర్లు, శానిటరి సామగ్రిని దోచుకుపోయారు. బాబోయ్ దొంగలంటూ గుత్తేదారుడు లబోదిబోమంటున్నాడు. ఇప్పటికే పలు దఫాలు వైర్లు వేసినా పదేపదే విద్యుత్ వైర్లు చోరీకి గురికావడంతో నష్టపోతున్నామని గుత్తేదారుడు వాపోతున్నాడు. గొల్లపుంతతో 4వేల గృహాలు నిర్మించారు. తొలి దశలో 2700 గృహాలు లబ్ధిదారులు అందించారు. వీటిలో 1200 కుటుంబాలు వారు నివాసం ఉండటం లేదు. రెండో దశలో 1300గృహాలు బుధవారం ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. నివాసాలు ఉండని టిడ్కో గృహాలను దొంగలు ఎంపిక చేసుకుని విద్యుత్‌వైర్లు, సామగ్రిని అపహరిస్తున్నారు. గృహ సముదాయం వద్ద సెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ విద్యుత్ వైర్లు, శానిటరి సామగ్రిని ఎత్తుకుపోతున్నారు.



టిడ్కోగృహ సముదాయంలో విద్యుత్ మీటర్లు

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో 2024 ఫేజ్-1నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అకడమిక్ డీన్ ఎం.సురేష్ తెలిపారు. 37మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని, వీరిలో 12మంది అత్యధిక పర్సంటైల్ సాధించి నీట్‌లో సీటు పొందేందుకు అర్హత మార్కులు సాధించినట్టు కళాశాల ఏజీఎం ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు బి.వరప్రసాద్, ఎం.భరద్వాజ్, ఎం.దుర్గాప్రవీణ్, సుధీర్‌జార్జ్, పి.లతిక, డి.శంకర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సీట్లుసాధించారన్నారు. శిక్షణ అందించిన అధ్యాపకులకు, సహకరించిన తల్లిదండ్రులకు డీన్ సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఈదరపల్లి నారాయణ కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్టాభి, అధ్యాపకులు శివన్నారాయణ, రవి, ఆనంద్, కృష్ణ, కుమార్‌రాజా, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సుందరపల్లి విద్యార్థి ప్రతిభ

కె.గంగవరం, ఫిబ్రవరి 13: మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సుందరపల్లికి చెందిన అడపా తరుణ్ వెంకట లోకేష్ జాతీయ స్థాయిలో 99.36 పర్సంటైల్ సాధించాడు. లోకేష్ తల్లి పద్మ సూర్యరామలక్ష్మి సుందరపల్లి మాజీ సర్పంచ్, తండ్రి నారాయణస్వామి సొసైటీ మాజీ అధ్యక్షుడిగా పనిచేశారు. లోకేష్‌ను పలువురు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యాధర్ ప్రతిభ

ఆలమూరు,ఫిబ్రవరి13: ఆలమూరుకు చెందినఉపాధ్యాయుడు అద్దరి శ్రీనివాస్ కుమారుడు విద్యాధర్ జేఈఈఫలితాల్లో 99.1పర్సంటైల్ సాధించాడు. విజయవాడలో ఇంటర్‌చదువుతున్న అతడిని పలువురు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో మోడరన్ ప్రతిభ

రామచంద్రపురం, ఫిబ్రవరి 13:జేఈఈ మెయిన్స్‌లో ఫలితాల్లో మోడరన్ జీఆర్‌సీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని మోడరన్ విద్యా సంస్థల అధినేత జి.వి.రావు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వయిజర్ సీహెచ్.శ్రీనివాస్, జెఈఈ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండపేట మున్సిపల్ సమావేశం

మండపేట, ఫిబ్రవరి 13: మండపేట మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు. ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

యానాం సమస్యలపై గవర్నర్‌కు వినతి



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఫిబ్రవరి 13: యానాంలో ప్రధాన సమస్యలు పరిష్కారం కోరుతూ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మంగళవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసైకు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు పుదుచ్చేరిలోని రాజ్‌నివాస్‌లో గవర్నర్ తమిళసైతో సమావేశమైన మల్లాడి 9అంశాలపై వినతిపత్రం అందజేశారు. గంటకుపైగా గవర్నర్‌తో చర్చించారు. యానాంలో రిక్రియేషన్ పేరుతో నుడుస్తున్న పేకాట క్లబ్బులపై చర్యలు తీసుకోవాలని కోరారు. యానాంలో పారిశుధ్యం పేరుతో ప్రజా ధనం దోచుకుంటున్నారని, డంపింగ్ యార్డ్, వరద పరిరక్షణ గట్టు, పలు శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ జీతాలు తదితర సమస్యలు పరిష్కరించాలని గవర్నర్‌ను కోరినట్టు మల్లాడి చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, ఫిబ్రవరి 13: ఏపీట్రాన్స్‌కో హైటెన్షన్ విద్యుత్ వైర్లకు మరమ్మతులు కోసం బుధవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు యానాంలో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ లంక కృష్ణారావు తెలిపారు.

రావులపాలెం: రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్లు మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

వెంకన్న ఆదాయం రూ.1.82 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,82,038 వచ్చింది.

టీడీపీలో పలువురు యువకులు చేరిక

మండపేట, ఫిబ్రవరి 13: తాపేశ్వరానికి చెందిన 30మంది వివిధ పార్టీలకు చెందిన యువకులు గ్రామానికి చెందిన యువ నాయకుడు దంగేటి గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టేకుమూడి ప్రసాద్, మెల్లెటి రాజా, ఫణీంద్ర, మహేష్, వీరబాబు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వేగుళ్ల శివరామకృష్ణ పాల్గొన్నారు.

జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



రాజోలు, ఫిబ్రవరి 13: జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం తాటిపాకలో ఆయన స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8.30గంటలకు తాటిపాకలో గొల్లపల్లి స్వగృహం వద్ద నుంచి బయలుదేరి తాటిపాక, మామిడికుదురు, గెద్దాడ, వేగివారిపాలెం, కడలి, మలికిపల్లి, కూనవరం, చింతలపల్లి, శివకోటి, రాజోలు, సోంపల్లి, పొదలాడ సెంటర్ నుంచి తాటిపాక మఠం మీదుగా జయహో బీసీ ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ యెనుముల నాగు, అడబాల సాయి, సాగి పాపయ్యరాజు, రాపాక నవరత్నం, బందెల పద్మ, మట్టపర్తి లక్ష్మి, ఈలి శ్రీనివాస్, జంపన సత్యనారాయణరాజు, అడబాల చంటి, గుద్దటి చిట్టబ్బాయి, నాగిరెడ్డి గోపీ, బేతినీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ సిటిజన్ మోర్చా రాష్ట్రాధ్యక్షుడిగా జొన్నలగడ్డ

రాజోలు, ఫిబ్రవరి 13: బీజేపీ సమర్థక్ సీనియర్ సిటిజన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రాజోలుకు చెందిన జొన్నలగడ్డ గోపాలకృష్ణ ఎంపికయ్యారు. రాజోలులో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు పితాని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో బీజేపీ సమర్థక్ జాతీయ అధ్యక్షుడు పి.చిన్నసుబ్బారావు, ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, కాకినాడ సమర్థక్ కార్యదర్శి అడపా శ్రీదేవి నుంచి జొన్నలగడ్డ నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో గొల్లమందల నిరంజన్‌రావు, యింటిపల్లి రామకృష్ణ, పొన్నాడ భాను, ఎస్.బాలకృష్ణ, జానకీరామ్, శ్రీరామచంద్రమూర్తి, సుబ్రహ్మణ్యం, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మలికిపురం, ఫిబ్రవరి 13: కొబ్బరి రైతులను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని కోరారు. కొబ్బరి రైతులకు ఆదాయం లేదని, వాతావరణ ప్రభావం నల్ల ముట్టి పురుగులతో మొత్తం కాయలు లేకుండా పోయాయని, ఉద్యానవన శాఖ ద్వారా రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

టీడీపీ హయాంలోనే అన్నివర్గాలకు గుర్తింపు

అంబాజీపేట, ఫిబ్రవరి 13: టీడీపీ హయాంలోనే అన్ని వర్గాలకు గుర్తింపు లభించిందని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు అన్నారు. గంగలకుర్రులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఇంటింటికి బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి గుడాల ఫణి, యర్రంశెట్టి వీరభద్రరావు, దూనబోయిన బాబులు, కాగితాపల్లి సాయిరామ్, జొన్నాడ విజయ్‌కుమార్, కమిడి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ

అంతర్వేది, ఫిబ్రవరి 13: సఖినేటిపల్లి మండలంలో 1,246 సంఘాల్లో 12,460 స్వయం సహాయ సంఘ సభ్యులకు వైఎస్సార్ ఆసరా నాల్గో విడత రూ.9.96,08,763 చెక్కును ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మంగళవారం పంపిణీ చేసారు. స్థానిక సమతా కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఏపీఎం కె.విజయ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జె.రోజా, ఎంపీడీవో బి.మంగాదేవి, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు బ్రేక్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి13: సాగులో ఉన్న చెరువులపై నివేదికను అధికారులు కలెక్టర్‌కు సమర్పించనున్నారు. సన్నవిల్లిలో అనధికార ఆక్వాసాగుపై గ్రామానికి చెందిన చిక్కల శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించారు. ఆక్వాజోన్ పరిధిలో లేని సన్నవిల్లిలో ఆక్వాసాగు వల్ల ఎదురవుతున్న కష్టనష్టాలపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాలతో జోన్ పరిధిలో లేనిఆక్వా సాగుకు బ్రేక్‌వేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

నేడు, రేపు హిమాలయ యోగి స్వస్థత శిబిరాలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13: రంగాపురం విశ్వవేద గాయత్రీ శక్తి పీఠంలో హిమాలయ యోగి, అంతర్జాతీయ యోగా మాస్టార్, వైదిక్ జ్యోతిష శాస్త్రవేత్త, రోగ నివారణ నిపుణుడు యష్ శేఖర్ రోగ నివారణ స్వస్థత శిబిరంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధి విశ్వనాథరాజు మాట్లాడుతూ పరమ గురువుల అనుగ్రహంతో ఎంతో మందికి స్వస్థత చేకూర్చాలన్నారు. బుధవారం ఉదయం 11గంటలకు అమలాపురం గాయత్రీ మందిరంలో, గురువారం ఆదిశేష నిలయంలో జరిగే కార్యక్రమాల్లో యష్ శేఖర్ పాల్గొంటారన్నారు. స్వస్థత కోసం దీర్ఘకాలిక రోగులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి ఆయన్ను దర్శించుకున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

అల్లవరం, ఫిబ్రవరి 13: పెదగరువు రోడ్డు, జాంబవన్ రోడ్డు, రూ.51లక్షలతో నిర్మించిన కోడూరుపాడు బీటీ రోడ్డును మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ మంగళవారం ప్రారంభించారు. మొల్లేటివారిపాలెం, ఆకులవారిపేట, రామారావుపేటల్లో మంచినీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. స్థల దాత, మాజీ ఎంపీపీ గుబ్బల మాతాకస్తూరిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, సాధనాల సూర్యనాగమణి, బొమ్ము బాలవేణి, ఎంపీడీవో కృష్ణమోహన్, ఎస్.సుదర్శనరావు, బొక్కా నాగశివప్రసాద్, యల్లమిల్లి బోస్, పాటి శ్రీరామ్, గుబ్బల బాబ్జీ, ఎస్.మౌనిక, ఏఈ జి.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు అధ్యక్షుడిగా సుధాకర్

రామచంద్రపురం, ఫిబ్రవరి 13: స్థానిక కాపు కళ్యాణ మండపంలో మంగళవారం రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి కాపునాడు సమావేశం జరిగింది. సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా నల్లా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నున్న చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడిగా తొగరు బ్రహ్మాజీరావు, రామచంద్రపురం మండలం అధ్యక్షుడిగా కంచర్ల వెంకటేశ్వరరావు, కె.గంగవరం, కాజులూరు మండలాల అధ్యక్షులుగా తాడాల జానకిరామ్, కోలా వీర భద్రస్వామి నాయుడు ఏకగ్రీవంగాఎన్నికైనట్టు సురేష్ తెలిపారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కార్యదర్శి గంగాధర్, అక్కిరెడ్డి శ్రీను, నల్లా వెంకటేష్, చిక్కాల స్వామి, చల్లా సత్తి బాబు, వీరబాబు, దుర్గాప్రసాద్, శివశంకర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: లాల్‌సలామ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ట్రూ లవర్
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: యాత్ర-2
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్